E-KABURU E-PAPER


# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 17-06-2025 (వారం) మంగళవారం

హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



'స్మార్ట్'ఫోన్లకు కట్టుబానిసలవుతున్న యువత » 3లో

## తొమ్మిది రోజుల్లో 9వేల కోట్లు ఇస్తాం





- 'రైతు నేస్తం' ప్రారంభోత్సవంలో రైతులతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్
- రైతు నేస్తం ప్రారంభోత్సవంలో రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- తొలిరోజు 41.25 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,349 కోట్లు జమ
- ఎకరానికి రూ.6 వేల చొప్పున విడుదలకు కంప్యూటర్ బటన్ నొక్కిన ముఖ్యమంత్రి
- ఎన్ని కష్టాలున్నా పెట్టుబడి సాయం ఆగదని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 1,034 వేదికల్లో 'రైతు నేస్తం' ప్రారంభం
- అన్నదాతలకు సబ్సిడీపై పనిముట్లు ఇస్తామని వెల్లడి
- వరితోపాటు కూరగాయలు,పప్పు దినుసులు పండించాలని పిలుపు

ఈ కబురు, హైదరాబాద్: రైతు భరోసా పథకం కింద వానాకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోని 70.11 లక్షల మంది రైతులకు చెందిన 1.49 లక్షల ఎకరాల సాగు యోగ్యమైన వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.6 వేల చొప్పున నిధులు విడుదల చేస్తూ కంప్యూటర్ బటన్ నొక్కారు. కేవలం 9 రోజుల్లో రైతులందరికీ మొత్తం రూ.9 వేల కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. తొలిరోజు సోమవారం 2 ఎకరాల లోపు 41,25,289 మంది రైతులకు రూ.2,349.83 కోట్లను వారి ఖాతాల్లో జమ చేశారు. 39.16 లక్షల ఎకరాలకు గాను ఈ డబ్బులు జమయ్యాయి. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్రంలోని 1,034 వేదికల్లో కొత్తగా 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రైతు భరోసా గురించిన ప్రకటన చేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..పదేళ్లలో వ్యవసాయాన్ని నీరుగార్చారు.. గడిచిన పదేళ్ల కాలంలో వ్యవసాయాన్ని నీరుగార్చారు. వరి వేస్తే ఉరే అని, వడ్లు కొనలేం అని పెద్దాయన చెప్పాడు. మేం పేద ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం ఇవ్వాలని సంకల్పించి దొడ్డు ధాన్యంకు బదులు సన్న ధాన్యం పండించమని రైతులను కోరాం. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించాం. ఈ మేరకు రైతులు సన్న వడ్లు పండిస్తే, సన్న బియ్యం పేదల కడుపు నింపుతున్నాయి. రాష్ట్ర రైతులు ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా 2.80 కోట్ల టన్నుల ధాన్యాన్ని పండించారు. తరువాయి 2లో

## మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'తో సైప్రస్ గౌరవించింది. సోమవారం ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఈ కబురు,నికోసియా: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'తో సైప్రస్ గౌరవించింది. సోమవారం ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. దానిని ఇరు దేశాల మధ్య స్నేహ బంధానికి, 140 కోట్ల మంది భారతీయులకు అంకితమిస్తున్నట్లు మోదీ తెలిపారు. దీంతో కలిపితే.. ఇప్పటివరకూ ప్రధాని మోదీని వరించిన అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య 23కు చేరుకుంది. సైప్రస్ పర్యటనలో భాగంగా నికోస్ క్రిస్టోడౌలిడెస్‌తో సమావేశమైన మోదీ.. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, పునరుత్పాదక ఇంధనం, పర్యావరణంసహా పలు ద్వైపాక్షిక రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం వంటి ప్రాంతీయ అంశాలపైనా తరువాయి 2లో



## స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయండి
- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించండి... మంత్రులకు సీఎం రేవంత్ సూచన
- జరగని నిర్ణయాలు ముందే చెబితే ప్రజల్లో పలుచన అవుతామంటూ మందలింపు

ఈ కబురు, హైదరాబాద్: జూలైలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని చెప్పారు.

తరువాయి 2లో



## మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల.. భారత్, పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

» 6లో



## పౌరులు.. టెహ్రాన్‌ను వెంటనే వీడండి: డొనాల్డ్



ఇరాన్‌కు ఇప్పటికే రెండో అవకాశం ఇచ్చిన డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక ప్రకటన చేయడం కలవరానికి గురి చేస్తోంది. జీ7 శిఖరాగ్ర సమావేశం వేళ ట్రంప్ పోస్టు ప్రాధాన్యతను సంతరించుకుంది. తరువాయి 3లో


## మంత్రి పొంగులేటిపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్



ఈ కబురు, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రకటన చేసిన రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. రిజర్వేషన్ల అంశంతో ముడిపడి ఉన్న స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొంగులేటి ప్రకటన చేయడాన్ని తప్పుబట్టారు. కేబినెట్‌లో చర్చించాల్సిన అంశాలను ముందుగానే మీడియాతో మాట్లాడితే ఎలా అంటూ పీసీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరి మంత్రిత్వ శాఖ అంశంపైన వేరొకరు మాట్లాడ్డం ఏంటని పీసీసీ ప్రశ్నించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై మంత్రులు మాట్లాడేటప్పుడు అన్ని అంశాలను పరిగణలోకి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పార్టీతో సంప్రదించకుండా ఎలాంటి ప్రకటనలు చేయొద్దని, మంత్రులు వారి శాఖల పరిధిలోని అంశాలను మాట్లాడాలని సెన్సిటివ్ అంశాలను, కోర్టు పరిధిలో అంశాలను మాట్లాడేప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని నేతల్ని సున్నితంగా మందలించారు.

## జరిగితే ఈ ఏడాదిలో పెళ్లి.. లేదంటే మాత్రం!

» 5లో



## 'బనకచర్ల'పై సీఎం చొరవ తీసుకోవాలి

బనకచర్ల విషయంలో కొందరు అడ్డగోలుగా మాట్లాడుతూ.. కేంద్ర మంత్రులు ఏంచేస్తున్నారంటూ విమర్శలు చేయడం సరికాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని భావిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని, కేంద్ర జలశక్తి మంత్రి ద్వారా ఏపీ సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.



ఈ కబురు, హైదరాబాద్: బనకచర్ల విషయంలో కొందరు అడ్డగోలుగా మాట్లాడుతూ.. కేంద్ర మంత్రులు ఏంచేస్తున్నారంటూ విమర్శలు చేయడం సరికాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని భావిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని, కేంద్ర జలశక్తి మంత్రి ద్వారా ఏపీ సీఎంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సోమవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రీఫీజిబిలిటీ రిపోర్ట్(పీఎఫ్ఆర్)ను కేంద్రం పూర్తిగా అధ్యయనం చేయాల్సి ఉంది. బనకచర్లపై తెలంగాణ లేవనెత్తిన అంశానికి సంబంధించి ఇప్పటికే ఏపీ ప్రభుత్వం కేంద్ర జలశక్తిశాఖకు, సెంట్రల్ వాటర్ కమిషన్‌కు నివేదిక ఇచ్చింది. జల ఒప్పందాలపై ఇరు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తితే సెంట్రల్ వాటర్ కమిషన్ సమగ్రంగా పరిశీలన జరుపుతుంది. బనకచర్ల నివేదిక కేంద్ర ప్రభుత్వం వద్దకు వచ్చినప్పుడు సరైన నిర్ణయం తీసుకుంటుంది. కానీ డీపీఆర్ కూడా సిద్ధం కాలేదు. తెలంగాణ తరఫున రాష్ట్ర ప్రభుత్వం సరైన వాదనలు వినిపించాలి. తరువాయి 2లో

## ఇరాన్ ప్రభుత్వ టీవీ కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడి



*ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం నాలుగో రోజైన సోమవారం పతాక స్థాయికి చేరుకుంది. ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ ఏకంగా 100కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది.*

ఈ కబురు,టెల్ అవీవ్: ఇజ్రాయెల్ఇరాన్ మధ్య యుద్ధం నాలుగో రోజైన సోమవారం పతాక స్థాయికి చేరుకుంది. ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ ఏకంగా 100కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో టెల్ అవీవ్, హైఫాతోపాటు ఇతర నగరాల్లోనూ భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. 8 మంది పౌరులు మృతి చెందారని, 300 మందికిపైగా గాయపడ్డారని ఇజ్రాయెల్ ఆరోగ్యశాఖ పేర్కొంది. టెల్ అవీవ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం సమీపంలోనూ క్షిపణి పడింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇజ్రాయెల్ దీటుగానే స్పందించింది. టెహ్రాన్ గగన తలంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు స్వైర విహారం చేశాయి. బాంబుల వర్షం కురిపించాయి. ఆదివారం దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) నిఘా అధిపతి, ఉప అధిపతిని మట్టుబెట్టిన ఇజ్రాయెల్.. సోమవారం ఏకంగా ఇరాన్ అధికారిక టీవీ (ఐఆర్ఐబీ) భవనంపై క్షిపణిని ప్రయోగించింది. టీవీ స్టూడియోలో మహిళా న్యూస్ రీడర్ వార్తలు చదువుతున్న సమయంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. అంతకుముందు ఐఆర్ఐబీ కార్యాలయం ఉన్న ప్రాంతంసహా టెహ్రాన్‌లోని మూడు జిల్లాలను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్ పౌరులను హెచ్చరించింది.

తరువాయి 2లో



## పోలవరం 'టీవోఆర్'ను అడ్డుకోండి

పోలవరం-బనకచర్ల ద్వారా గోదావరి జలాల మళ్లింపు కోసం ప్రాజెక్టు టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్)లో ఏపీ చేసిన మార్పులను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

»3లో

## కృష్ణమ్మ కదలాలి.. గోదారి పారాలి



కృష్ణా, గోదావరి పరీవాహకాల్లో ప్రాజెక్టులు నోళ్లు తెరుచుకుని చూస్తున్నాయి. రెండు బేసిన్లలోని ప్రాజెక్టులు మొత్తం 641.68 టీఎంసీల మేర ఖాళీగా ఉన్నాయి.

» 3లో

## సెల్‌ఫోన్లు ఇవ్వండి..

## కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం

- విచారణ అనంతరం తిరిగి వెళ్తున్న కేటీఆర్
- కేటీఆర్‌కు ఏసీబీ అధికారుల ఆదేశం
- 2021–2024 మధ్య వినియోగించిన ఫోన్లు 18లోగా అప్పగించాలని సూచన
- అంతకుముందు సీజ్ చేసేందుకు యత్నం..ఫోన్ తేలేదన్న కేటీఆర్!
- ఫార్ములా– ఈ రేసు కేసులో 8 గంటలకు పైగా విచారణ
- అవసరమైతే మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని స్పష్టీకరణ



ఈ కబురు, హైదరాబాద్: ఫార్ములా-ఈ కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావును ఏసీబీ అధికారులు సోమవారం 8 గంటలకు పైగా విచారించారు. రేసు నిర్వాహకులతో కుదుర్చుకున్న ఒప్పందాలు మొదలు, నిధుల మళ్లింపు, నిబంధనల అతిక్రమణ, విదేశీ కంపెనీతో జరిపిన లావాదేవీలు..తదితర అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేసేందుకు ప్రయత్నించారు. ఫోన్ ఇవ్వమని కోరగా..తీసుకురాలేదని కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. దీంతో ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణకు సంబంధించి ఒప్పందాలు మొదలైన 2021 నుంచి 2024 మధ్య కాలంలో వినియోగించిన సెల్‌ఫోన్లు ఈ నెల 18 లోగా అప్పగించాలని కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఆదేశించారు.


**వరుస ప్రశ్నలు..మధ్యమధ్యలో బ్రేక్**


ఏసీబీ అధికారుల నోటీసుల మేరకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటలకు తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. కేవలం కేటీఆర్ వాహనాన్ని మాత్రమే పోలీసులు లోనికి అనుమతించారు. కాగా సాయంత్రం 6 గంటల వరకు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు.

తరువాయి 2లో

## ఉద్యోగాల కోతకు ఏఐ సాకు!

» 4లో



## ఇరాన్ సుప్రీం లీడర్‌ను హతమారిస్తేనే యుద్ధానికి ముగింపు: నెతన్యాహు కీలక వ్యాఖ్యలు

» 3లో

మొదటి పేజీ తరువాయి

# తొమ్మిది రోజుల్లో 9వేల కోట్లు ఇస్తాం

**రూ.1,29,000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు**

సర్పంచులు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అంటున్నారు. మేం అధికారంలోకి వచ్చే నాటికే సర్పంచుల పదవీ కాలం ముగిసింది. కాంట్రాక్టర్లకు మరో రూ.60 వేల కోట్లు బకాయిలు పెట్టారు. మొత్తంగా రూ.1,29,000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, ఫీజు రీయింబర్స్‌మెంటు డబ్బులు వాడుకున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ రూ.12 వేల కోట్లు బకాయి పెట్టి పోయారు. పదేళ్లలో రూ.8 లక్షల 20 వేల కోట్ల అప్పు మా నెత్తిపై మోపి నడుం వంగిపోయే పరిస్థితి తెచ్చారు. రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసంలోకి నెట్టి పోయినా, ఒక్కొక్క మెట్టు పేర్చుకుంటూ సరి చేసుకుంటూ వస్తున్నాం. ఎన్ని కష్టాలు ఉన్నా రైతులకు పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించుకున్నాం. మంత్రులందరితో చర్చించి రైతులందరికీ 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు వారి ఖాతాల్లో వేయాలని నిర్ణయించాం.

**రైతు ఆశీర్వాదంతోనే ఏదైనా సాధ్యం**

వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, చివరకు ముఖ్యమంత్రి అయినా రైతు ఆశీర్వాదం ఉంటేనే అది సాధ్యపడుతుంది. కుర్చీ బలంగా ఉంటుంది. అందుకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం. రైతును రాజును చేయడం, వ్యవసాయాన్ని పండుగ చేయడం లక్ష్యంగా నిర్ణయాలు తీసుకున్నాం.

గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రెండు విడతలుగా రుణమాఫీ కింద రైతులకు ఇచ్చింది రూ.17 వేల కోట్ల లోపే. ఊళ్లళ్ల పెళ్లిళ్లలో ఎక్కువ కట్నాల కోసం పిలగాని తండ్రులు కార్లు, మేడలు చూపించినట్లు..పెద్దాయన రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఆనాటి గాయాలు మానలేదు. అయినా రైతుల కోసం రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, రైతుబీమా, బోనస్ కింద 18 నెలల్లోనే రూ.1,01,720 కోట్లు ఖర్చు చేశాం. ఇంత తక్కువ సమయంలో అంత పెద్ద మొత్తంలో రైతుల కోసం ఖర్చు చేసిన రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. దీనిపై గ్రామ సభలు పెట్టి చర్చిద్దాం. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 24 గంటల్లో డబ్బులు జమ చేశాం. ధరణి స్థానంలో భూభారతి తీసుకొచ్చాం. రైతులకు మేలు చేసేందుకే ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.

**చావుల పునాదుల మీద రాజకీయం చేస్తున్నారు**

రాష్ట్రంలో రైతుల కోసం, ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని తక్కువ చేసే ప్రయత్నం జరుగుతోంది. చిన్న చిన్న పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్తుంటే..మొన్ననే వచ్చాడు పిలగాడు కుదురుకోనిద్దాం అని లేకుండా రాజకీయం చేస్తున్నారు. విద్యార్థులు, రైతులు చనిపోతే సంతోస్తున్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఆనందం పొందుతున్నారు. చావుల పునాదుల మీద రాజకీయం చేస్తున్నారు. నేను ఎవరినీ కలవకుండా ఫాం హౌస్‌లో లేను. అయినా రాజకీయం చేస్తూ విమర్శలు చేస్తున్నారు.

**విద్యార్థులు జొన్న రొట్టెలు తినాలి**

చిన్నప్పుడు మా ప్రాంతంలో కందులు, బుడమ కాయలు (దోసకాయలు) పండేవి. దోసకాయ కందిపప్పు కూరను జొన్నరొట్టెతో తింటే ఎంతో కమ్మగా ఉండేది. మటన్, చికెన్ కూడా పనికిరాదు. విద్యార్థులు జొన్నరొట్టెలు తినండి. మీ బట్టలు మీరే ఉతుక్కోండి. ఏ సిక్స్ ప్యాక్ ఎక్సర్‌సైజ్‌లు పనికిరావు. వరి ఒక్కటే కాదు. కూరగాయలు, కందులు, పెసర్లు వంటి మిల్లెట్లు పండించాలి. రైతులకు సబ్సిడీతో పనిముట్లు ఇస్తాం. అధునాతన పంటలు కాదు.. తాతలు, తండ్రులు పండించిన పంటలను మళ్లీ పండించాలి. కూరగాయలు పండిస్తే హైదరాబాద్‌లో అమ్ముకోవచ్చు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించేందుకు అనుభవజ్ఞులైన రైతులతో రైతు వేదికల వద్ద పాఠాలు చెప్పించండి. భూమి రైతుకు ఆత్మ గౌరవం..రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఎవరు ఎన్ని ధర్నాలు చేసినా, బట్టలు చించుకున్నా పదేళ్లు మన ప్రభుత్వమే ఉంటుంది.





# మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం



ఈ కబురు,నికోసియా: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'తో సైప్రస్ గౌరవించింది. సోమవారం ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. దానిని ఇరు దేశాల మధ్య స్నేహ బంధానికి, 140 కోట్ల మంది భారతీయులకు అంకితమిస్తున్నట్లు మోదీ తెలిపారు. దీంతో కలిపితే.. ఇప్పటివరకూ ప్రధాని మోదీని వరించిన అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య 23కు చేరుకుంది. సైప్రస్ పర్యటనలో భాగంగా నికోస్ క్రిస్టోడౌలిడెస్‌తో సమావేశమైన మోదీ.. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, పునరుత్పాదక ఇంధనం, పర్యావరణంసహా పలు ద్వైపాక్షిక రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చలు జరిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్‌రష్యా యుద్ధం వంటి ప్రాంతీయ అంశాలపైనా సమాలోచనలు జరిపారు. అనంతరం వారిద్దరూ కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత్‌కు విశ్వసనీయ భాగస్వామిగా సైప్రస్‌ను మోదీ అభివర్ణించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇరువురు నేతలు ఆందోళన వెలిబుచ్చారు. ఇది యుద్ధాల శకం కాదని తాను, క్రిస్టోడౌలిడెస్ ముక్తకంఠంతో అభిప్రాయపడినట్లు మోదీ చెప్పారు. పహల్గాం ఉగ్ర దాడిని సైప్రస్ అధ్యక్షుడు ఖండించారు. ప్రధాని మోదీ చారిత్రక సెంటర్ ఆఫ్ నికోసియాకు చేరుకున్నప్పుడు.. స్థానిక చట్టసభ సభ్యురాలు మైఖేలా క్రైథియోటి ఆయనకు పాదాభివందనం చేశారు.

సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలిడెస్‌కు చేనేత కశ్మీరీ సిల్క్ తివాచీని ప్రధాని మోదీ బహూకరించారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో తయారైన వెండి పర్సునూ అందజేశారు. శతాబ్దాలుగా వర్ధిల్లుతున్న హస్త కళల్లోని కుట్టు టెక్నిక్‌లను ఉపయోగించి కశ్మీర్‌లో తివాచీని తయారు చేయించారు. మల్బరీ సిల్క్‌ను ఉపయోగించారు. సహజ రంగులను అద్దారు. చూసే కోణాన్ని బట్టి ఈ కార్పెట్ రంగులను మారుస్తుంది. సంప్రదాయ లోహాలకు ఆధునికతను జోడించి వెండి పర్సును తయారు చేశారు. పుష్పాల ఆకృతులతో రూపొందించారు.

మొదటి పేజీ తరువాయి

# సెల్‌ఫోన్లు ఇవ్వండి.. కేటీఆర్‌కు ఏసీబీ ఆదేశం



వరుస ప్రశ్నలు..మధ్యమధ్యలో బ్రేక్

ఏసీబీ అధికారుల నోటీసుల మేరకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటలకు తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. కేవలం కేటీఆర్ వాహనాన్ని మాత్రమే పోలీసులు లోనికి అనుమతించారు. కాగా సాయంత్రం 6 గంటల వరకు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోష్, జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్‌లతో కూడిన బృందం ప్రశ్నించినట్టు తెలిసింది. మధ్యలో టీ బ్రేకులు ఇచ్చారని, మధ్యాహ్నం 45 నిమిషాలకు పైగా భోజన విరామం ఇచ్చినట్టు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈ ఏడాది జనవరి 9న కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా సోమవారం నాటి విచారణలో పలు కీలక అంశాలపై ప్రశ్నించారు.

డాక్యుమెంట్లు ముందుంచి..

ఈ కేసులో ఏ-2 అయిన సీనియర్ ఐఏఎస్ అధికారిఅర్వింద్‌కుమార్, ఏ-3 హెచ్‌ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డితో పాటు గ్రీన్‌కో ఏస్ నెక్స్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్ స్టేట్మెంట్లలో గుర్తించిన అంశాలు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులను, సీఈవోను జూమ్ మీటింగ్ ద్వారా గతంలో వర్చువల్‌గా విచారించిన సమయంలో వారిచ్చిన స్టేట్మెంట్ల ఆధారంగా తయారు చేసుకున్న ప్రశ్నావళి ఆధారంగా కేటీఆర్‌ను అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

ఇప్పటికే సేకరించిన పలు డాక్యుమెంట్లను ముందుంచి ప్రశ్నించారు. వరుస ప్రశ్నలు వేస్తూ, డాక్యుమెంట్లను చూపుతూ వివరాలు రాబట్టారు. కేటీఆర్ చెప్పేదంతా వీడియో రికార్డింగ్ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండగా ఏ హోదాలో ఆదేశాలు ఇచ్చారనే కోణంలో విచారణ సాగింది. మొదటి దఫా విచారణలో కేటీఆర్ ఇచ్చిన సమాచారం, కేసు దర్యాప్తులో సేకరించిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఆధారంగా క్రాస్ క్వశ్చనింగ్ చేశారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ఖాతాలకు రూ.45.71 కోట్లు బదిలీ చేయడంపై, అనధికారింగా ఈ నగదు బదిలీ ఎందుకు చేయాల్సి వచ్చిందన్న విషయాలపై మరోసారి ప్రశ్నించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీ ఎలక్టోరల్ బాండ్స్ గ్రీన్‌కో కంపెనీ కొనుగోలుపైనా ఆరా తీసినట్టు తెలిసింది. కాగా అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు సూచించినట్టు తెలిసింది.

బీఆర్ఎస్ శ్రేణుల హడావుడి..ఉద్రిక్తత

కేటీఆర్ విచారణకు బంజారాహిల్స్ వస్తుండడంతో పాటు అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమావేశం జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీబీ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ముందుగానే బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్‌ను అనుసరిస్తూ పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు ఏసీబీ కార్యాలయం వద్దకు వచ్చారు. అయితే పోలీసులు వారిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ముందే అడ్డుకున్నారు.

కొందరు బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు పక్కనే ఉన్న నీలోఫర్ కేఫ్‌లోకి వెళ్లడంతో వారిని అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నీలోఫర్ కేఫ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలను పోలీసులు కాసేపు మూసివేయించారు.

మొదటి పేజీ తరువాయి

# పౌరులు.. టెహ్రాన్‌ను వెంటనే వీడండి: డొనాల్డ్ ట్రంప్



ఈ కబురు: ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. టెహ్రాన్‌లో ఉన్న పౌరులు వెంటనే వెళ్లిపోవాలని సూచించారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ పాల్గొన్నారు. అమెరికాతో ఇరాన్ అణు ఒప్పందాన్ని అంగీకరించి ఉండాల్సిందని నొక్కి చెప్పారు. మరింత సమయం ఆలస్యం కాకముందే ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని సూచించారు. ఇప్పటికే రెండో అవకాశం ఇచ్చినట్లు గుర్తు చేశారు. తన సోషల్ మీడియా 'ట్రూత్' వేదికగా పోస్టు పెట్టారు.

"నేను చెప్పిన అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసి ఉండాల్సింది. ఇప్పుడు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది ఎంత సిగ్గుమాలిన చర్య. ఇంకాస్త సులువుగా చెప్పాలంటే.. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. ఇప్పటికే పదే పదే చెప్పా. అందరూ టెహ్రాన్‌ను ఖాళీ చేయాలి" అని పోస్టు చేశారు. ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారే ప్రమాదం లేకపోలేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఇరాన్ ప్రభుత్వ టీవీ కార్యాలయంపై ఇజ్రాయెల్ దాడి



ఈ కబురు,టెల్ అవీవ్: ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య యుద్ధం నాలుగో రోజైన సోమవారం పతాక స్థాయికి చేరుకుంది. ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ ఏకంగా 100కు పైగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. దీంతో టెల్ అవీవ్, హైఫాతోపాటు ఇతర నగరాల్లోనూ భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. 8 మంది పౌరులు మృతి చెందారని, 300 మందికిపైగా గాయపడ్డారని ఇజ్రాయెల్ ఆరోగ్యశాఖ పేర్కొంది. టెల్ అవీవ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం సమీపంలోనూ క్షిపణి పడింది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇజ్రాయెల్ దీటుగానే స్పందించింది. టెహ్రాన్ గగన తలంపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు స్వైర విహారం చేశాయి. బాంబుల వర్షం కురిపించాయి. ఆదివారం దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) నిఘా అధిపతి, ఉప అధిపతిని మట్టుబెట్టిన ఇజ్రాయెల్.. సోమవారం ఏకంగా ఇరాన్ అధికారిక టీవీ (ఐఆర్ఐబీ) భవనంపై క్షిపణిని ప్రయోగించింది. టీవీ స్టూడియోలో మహిళా న్యూస్ రీడర్ వార్తలు చదువుతున్న సమయంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. అంతకు ముందు ఐఆర్ఐబీ కార్యాలయం ఉన్న ప్రాంతంసహా టెహ్రాన్‌లోని మూడు జిల్లాలను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్ పౌరులను హెచ్చరించింది.

**విజయం మాదే -నెతన్యాహు**

టెహ్రాన్ గగన తలంపై తాము పూర్తి నియంత్రణ సాధించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఎప్పుడంటే అప్పుడు తమ యుద్ధ విమానాలు ఇరాన్ రాజధానిపై దాడులు చేయగలవని పేర్కొంది. ఉపరితలం నుంచి ఉపరితలానికి దూసుకెళ్లే ఇరాన్ క్షిపణి వ్యవస్థల్లో మూడో వంతు భాగాన్ని (120కు పైగా మిసైల్ లాంఛర్ వ్యవస్థలు) తాము నాశనం చేశామని తెలిపింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ధ్రువీకరించారు. యుద్ధ విమానాలతో ఇరాన్ అణు కేంద్రాలను, బాలిస్టిక్ క్షిపణులను ధ్వంసం చేస్తామని తెలిపారు. టెహ్రాన్ గగన తలంపై తాము పూర్తిగా నియంత్రణ సాధించడం.. ఈ యుద్ధంలో కీలక మలుపని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ విజయపథంలో ఉందని చెప్పారు.

ఆదివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఐఆర్‌జీసీ నిఘా సంస్థ అధిపతి బ్రిగేడియర్ మహమ్మద్ కజేమి, ఉప అధిపతి హసన్ మొహాక్విక్ హతమయ్యారు. ఈ దాడుల్లో ఇంటెలిజెన్స్ అధికారి మొహసెన్ బఘేరి కూడా మృతి చెందినట్లు ఇరాన్ వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

బంకర్‌లో ఖమేనీ

ఇరాన్ సుప్రీం అయతొల్లా అలీ ఖమేనీని అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఈశాన్య టెహ్రాన్‌లోని బంకర్‌లో కుటుంబంతో కలిసి ఖమేనీ తలదాచుకున్నట్లుగా మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. శుక్రవారం ఖమేనీ నివాసం సమీపంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఆదివారం ఈ ప్రాంతంలోనే మరోసారి పేలుడు శబ్దాలు వినిపించాయి. దీంతో ఖమేనీని బంకర్‌కు తరలించినట్లు తెలుస్తోంది.

ఎన్‌పీటీకి ఇరాన్ దూరం

ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి వైదొలగుతామని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు పార్లమెంటులో బిల్లును సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంది. అయితే తాము సామూహిక జనహనన ఆయుధాల తయారీకి వ్యతిరేకమని తెలిపింది. అణ్వస్త్ర వ్యాప్తిని అరికట్టే ఈ అంతర్జాతీయ ఒప్పందంపై ఇరాన్ 1968లో సంతకం చేసింది. దీనిపై సంతకాలు చేసిన దేశాలు అణ్వాయుధాల తయారీ, సంపాదించడం, బదిలీ వంటివి చేయకూడదు.

**మాపై అణు దాడి చేస్తే రంగంలోకి పాక్!**

ఇజ్రాయెల్‌ఇరాన్ ఉద్రిక్తతల వేళ ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) జనరల్ మొహసిన్ రెజాయి కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశంపై ఇజ్రాయెల్ అణు బాంబును ప్రయోగిస్తే అణ్వాయుధ దేశమైన పాకిస్థాన్ రంగంలోకి దిగుతుందని హెచ్చరించారు. 'ఇరాన్‌పై ఇజ్రాయెల్ అణు బాంబు ప్రయోగిస్తే ఇజ్రాయెల్‌పై అణు బాంబు వేస్తామని పాకిస్థాన్ మాకు హామీ ఇచ్చింది' అని పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను పాకిస్థాన్ ఖండించింది. ఇరాన్ జనరల్ వీడియోను ఫ్యాబ్రికేట్ చేశారని పాకిస్థాన్ విదేశాంగశాఖ మంత్రి ఇషాక్ దార్ స్పష్టం చేశారు. ఇది తప్పుడు వార్తని ఖండించారు.

అమెరికా దౌత్య కార్యాలయాన్ని తాకిన ఇరాన్ క్షిపణి

ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో ఒకటి టెల్ అవీవ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని సోమవారం తాకింది. దాడిలో కార్యాలయం స్వల్పంగా దెబ్బతింది. ఈ ఘటనలో సిబ్బంది ఎవరూ గాయపడలేదని అమెరికా దౌత్యవేత్త మైక్ హకబీ తెలిపారు.

**సురక్షిత ప్రదేశాలకు భారతీయ విద్యార్థులు**

ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయ విద్యార్థులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. అక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు విదేశాంగశాఖ తెలిపింది.

పశ్చిమాసియాలో విమానాశ్రయాల మూసివేత

ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలోని పలు విమానాశ్రయాలను మూసివేశారు. ఇజ్రాయెల్, ఇరాన్, ఇరాక్‌లలోని అన్ని విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. వేల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఇరాన్ గగనతలాన్ని అధికారులు పూర్తిగా మూసివేశారు. మరోవైపు ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొస్సాద్‌కు ఏజెంట్‌గా పని చేస్తున్న ఇస్మాయిల్ ఫెక్రీని సోమవారం ఇరాన్ ఉరితీసింది.

**యుద్ధం ఆపాలంటే ఒక్క ఫోన్‌కాల్ చాలు**

తమపై దాడి చేస్తున్న ఇజ్రాయెల్‌ను ఆపాలంటే ఒక్క ఫోన్‌కాల్ చాలని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. 'నెతన్యాహు లాంటి నాయకుడిని ఆపాలంటే వాషింగ్టన్ నుంచి ఒక్క ఫోన్‌కాల్ చాలు. మళ్లీ చర్చలకు మార్గం ఏర్పడుతుంది' అని పేర్కొన్నారు. జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కెనడా వెళ్లిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధాన్ని ఇరాన్ నెగ్గలేదని పేర్కొన్నారు. మరింత ఆలస్యం కాకముందే ఇరాన్ చర్చలకు రావాలని సూచించారు.

మొదటి పేజీ తరువాయి

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

ఈ కబురు, హైదరాబాద్: జూలైలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. ఏడాదిన్నర కాలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని చెప్పారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిని వారు గమనిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న మంత్రులతో, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో సీఎం 45 నిమిషాలకు పైగా సమావేశమయ్యారు. జరగని నిర్ణయాలను ముందుగానే ప్రకటించడం వల్ల ప్రజల్లో పలుచన అవుతామని స్థానిక సంస్థల ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కలు చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి సుతిమెత్తగా మందలించారు. కాగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. మంత్రులు టార్గెట్‌లు పెట్టుకుని మరీ పని చేయాలని, స్థానిక ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పర్యటనలో ఉన్న కొండా సురేఖ మినహా మంత్రులందరూ ఈ భేటీకి హాజరయ్యారు. ఎన్ని ఎకరాలున్నా రైతుభరోసా!: ప్రస్తుత రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, రైతు భరోసా తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రులతో రేవంత్ చర్చించినట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం..ఈనెలాఖరు వరకు ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.రైతు భరోసా విషయంలో రాజీ పడేది లేదని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగుతున్నందున ఎన్ని ఎకరాలున్నా రైతు భరోసా వేద్దామని ఆయన అన్నట్టు సమాచారం. స్థానిక ఎన్నికల గురించి బయట మాట్లాడేదాని కంటే, ప్రజలకు తామిచ్చిన హామీలను అమలు చేస్తున్నామని వివరించడంపైనే దృష్టి పెట్టాలని అన్నట్టు తెలిసింది. జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు సమన్వయంతో వ్యవహరించాలని, బీఆర్ఎస్ బలం కొద్దోగొప్పో ఉన్న జిల్లాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టి పనిచేయాలని సూచించారని సమాచారం.

బనకచర్లపై కేంద్రంతో తేల్చుకుందాం..

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో కేంద్రంతోనే తేల్చుకుందామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఏపీ ప్రభుత్వం ప్రీ ఫీజబులిటీ నివేదికను సమర్పించడం, దానికి డీపీఆర్‌ను సమర్పించాలని కేంద్రం కోరడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకుని వద్దామని అన్నట్లు తెలిసింది.

# 'బనకచర్ల'పై సీఎం చొరవ తీసుకోవాలి

'కాళేశ్వరం'పై భాజపాది ఎప్పుడూ ఒకేమాట. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో దోపిడీ జరిగిందని నిపుణులు చెప్పారు.. అది రుజువైంది. భారాస అధికారంలో ఉన్నప్పుడు కూడా కాళేశ్వరం అవినీతిపై సీబీఐ దర్యాప్తు కోరాం. ఇప్పుడూ అదే డిమాండ్ చేస్తున్నాం. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్టాండ్‌ను మార్చుకుంది. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ కోరుతూ భాజపా గతంలో హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ కేసుపై కాంగ్రెస్ ఎందుకు సీబీఐ విచారణ అడగడం లేదు.. కేసీఆర్ కుటుంబం కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యింది. ఆ రెండు పార్టీలు భాజపాపై లేనిపోని విమర్శలు చేస్తున్నాయి. దేశంలో జనగణనతోపాటే కులగణన చేయాలని కేంద్రం నోటిఫికేషన్ జారీచేయడం ఆహ్వానించదగ్గ విషయం. ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు బీసీలకు 42% రిజర్వేషన్‌తో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనంతో ఎన్నికలను వాయిదా వేయడం సరికాదు. అన్ని స్థానాల్లో భాజపా పోటీచేస్తుంది'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపుపై జోనల్ కమిషనర్ సమీక్ష సమావేశం

**పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ పరిధిలో వరద ముంపు నివారణ చర్యల్లో భాగంగా జోనల్ కమిషనర్ హేమంత్ భోర్కడే సోమవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, హైడ్రా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలో వరద నీటి పారుదల నెట్వర్క్ పై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జోన్ పరిధిలో వరద ముంపుకు గురయ్యే ప్రాంతాల వివరాలను అధికారులు జోనల్ కమిషనర్ కు అందజేశారు దీంతోపాటు వర్షాకాలంలో వరద నీరు నిలిచిపోయే ప్రాంతాల వివరాలను సేకరించిన జోనల్ కమిషనర్ ముంపు సమస్యను తప్పించే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వరద నీరు సాఫీగా పారే విధంగా చర్యలు తీసుకోవాలని, నాలాల పూడికతీత, విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది.. హైడ్రా విభాగం కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. భారీ వరదల కారణంగా ఎక్కడైనా వరద నీరు నిలిచిపోతే యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత వరకు శేరిలింగంపల్లి జోన్ ప్రజలకు వరద ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలోసర్కిల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్

# 'స్మార్ట్'ఫోన్లకు కట్టుబానిసలవుతున్న యువత



ఈ కబురు,కర్ణుడి కవచ కుండలాల్లా స్మార్ట్ ఫోన్ ఇప్పుడు మన శరీరంలోనూ ఒక భాగంగా మారిపోయింది. ఫోన్ ఉంటేనే అన్ని అవయవాలూ ఉన్నట్లు! ఫోన్ చూస్తుంటేనే అన్ని అవయవాలూ బాగా పని చేస్తున్నట్లు! నిద్రలోను, మెలకువలోను మన మైండ్ ఫోన్ మీదే. ఫోన్‌కి ఇంతగా 'కట్టు బానిస'అయిపోతే ఆరోగ్యం దెబ్బతింటుందని వైద్యులు హెచ్చరిస్తున్నా ఫోన్‌ని వదల్లేకపోతున్నాం.అది మన తప్ప కాదు. ఫోనే మనల్ని వదలటం లేదు. మరి దీనికి పరిష్కారం లేదా? లేకనేం, 'డిజిటల్ డీటాక్స్'ఉంది అంటున్నారు వైద్య నిపుణులు, సైకాలజిస్టులు. ఇటీవల కర్ణాటక ప్రభుత్వం, అఖిల భారత గేమింగ్ ఫెడరేషన్‌తో కలిసి బెంగళూరులో 'బియాండ్ స్క్రీన్స్'అనే కార్యక్రమాన్ని చేపట్టింది. డ్రగ్స్‌కి బానిసలు అయినట్టే.. స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి డిటిజల్ ఉపకరణాలు, ముఖ్యంగా అందులోని సోషల్ మీడియాకు బానిసలైనవారికి కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. అంతేకాకుండా విద్య, ఉపాధి వంటి అంశాల్లో తాత్కాలిక, దీర్ఘకాలిక పరిష్కారాలూ చూపిస్తారు. మనం డిజిటల్ ఉపకరణాలకు ఎంతగా బానిసలు అయిపోతున్నామో చెప్పేందుకు ఇదో చిన్న ఉదాహరణ మాత్రమే. దీనికి పరిష్కారమే డిజిటల్ డీటాక్స్.

**స్క్రీన్‌పై ఈదులాట తగ్గాలి**

ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, రీల్స్, షార్ట్స్ , యూట్యూబ్.. ఈ ప్రపంచంలోకి అడుగుపెడితే ఒక పట్టాన మనల్ని బయటపడనివ్వదు. ఇదో మాయాలోకం. ఫోన్‌లో చార్జింగ్ అయిపోయేంత వరకు స్క్రీన్‌పై ఈదులాట సాగుతూనే ఉంటుంది. తలనొప్పిగా ఉన్నది గమనించం. కళ్లు మసక బారుతున్నదీ పట్టించుకోం. నిస్సత్తువ, నిస్తేజం అన్నవి స్క్రీన్‌ని అన్నేసి గంటలు చూడటం వల్లనే అనీ గుర్తించం. అందుకే 'డిజిటల్ డీటాక్స్'అవసరం అని నిపుణులు సూచిస్తున్నారు. వీకెండ్‌లో 'పీస్ ఆఫ్ మైండ్' డిజిటల్ డీటాక్స్ అంటే నెమ్మదిగా స్మార్ట్ ఫోన్ స్క్రీన్‌ని చూసే టైమ్‌ని తగ్గించుకోవటం. తద్వారా అనారోగ్యాల ముప్పునుంచి తప్పించుకోవటం. మన చేతిలో పట్టే ఫోన్‌ని మన మెదడును అప్పగించేసి బానిసలు కాకుండా ఉండటం. మనకు వారాంతంలో ఎలా సెలవో అలాగే గ్యాడ్జెట్లకు వీక్లీ ఆఫ్ ఇవ్వాలి. వీకెండ్‌లో ముఖ్యమైన పనులు తక్కువగా ఉంటాయి డిజిటల్ డీటాక్స్ మొదటి దశకు ఈ రోజులు అనుకూలంగా ఉంటాయి. డిజిటల్ డీటాక్స్ కూడా సాధనేడిజిటల్ డిటాక్స్‌లో భాగంగా ముందుగా డిజిటల్ ఉపకరణాలను దూరంగా పెట్టాలి. అత్యవసరమైతే తప్ప వాటి జోలికి పోకూడదు. నిజానికిది అంత సులభమైన సాధన కాదు. ప్రారంభంలో ఏమీ తోచదు. ఎందుకంటే అలవాటైపోయిన ప్రాణం కదా. ఒంటరిగా ఉన్నట్లనిపిస్తుంది. నోటిఫికేషన్‌లు ఏమైనా వచ్చి ఉంటాయా అన్న ఆసక్తి, ఆందోళన మనసును పీకుతుంటుంది. స్థిమితంగా ఉండలేం. ప్రపంచంలో జరిగే అతి ముఖ్యమైన సంఘటనలు మిస్ అవుతున్నామన్నంత ఆరాటం ఉంటుంది. కానీ, ఏమీ ఫర్వాలేదు. అలవాటు అయ్యాక మాత్రం తేలిగ్గా చేయగలుగుతాం. ఫోన్‌ని స్విచాఫ్ చెయ్యక్కర్లేదు. ఫోన్ మీద నుంచి మనసును స్విచాఫ్ చేసుకుంటే చాలు.

**పక్కా ప్లానింగ్‌తో..**

- అలాగే డీటాక్సింగ్ సమయంలో మనం చేయవలసిన పనులు ముందే అనుకుంటే మనసు ఫోన్ మీదకు మళ్లదు.
- ఉదయం పూట ఖాళీ దొరికితే జిమ్‌కు వెళ్లొచ్చు.
- పార్కులో రోజూ ఫోన్ లేకుండా రన్నింగ్, వ్యాయామం, యోగా వంటివి ఒక్కరైనా, నలుగురితో కలిసైనా చేయండి.
- స్నానం చేశాక మీకు నచ్చిన ఆలయానికి వెళ్లండి.
- ఇంటి పనుల్లో మీ శ్రీమతికి, కుటుంబ సభ్యులకు సాయం చేయండి.
- కొత్తకొత్త రకాల మొక్కలను పెంచండి.
- మీ స్నేహితులకు ఫోన్ చేసి గెట్ టుగెదర్ ఏర్పాటుచేసుకోవచ్చు. కానీ, అందరూ ఫోన్లు పక్కన పెట్టేయాలన్న కండిషన్ పెట్టుకోండి.
- మంచి పుస్తకం చదవండి. ఆన్‌లైన్లో కాదు.. కొని, చదవండి. లేదంటే ఎవరి దగ్గర నుంచైనా తీసుకుని చదవండి.
- ధ్యానం అలవాటు చేసుకోండి.
- మీకు బాగా దగ్గరివాళ్లు లేదా మనసుకు నచ్చిన వాళ్లతో రెస్టారెంటుకు భోజనానికో, పార్కుకో, షాపింగుకో వెళ్లండి.
- స్నేహితులూ, పిల్లలతో కలిసి క్రికెట్ లాంటి ఆటలు ఆడండి.
- కనీసం ఏడాదికి ఒకసారి.. ఒక అనాథాశ్రమం లేదా వృద్ధాశ్రమంలో ఒక రోజు పూర్తిగా గడపండి.
- మనసుంటే మార్గం ఉంటుంది. ఇలాంటి జాబితాను ఎవరికి వారు వారి ఇష్టాయిష్టాలకు అనుగుణంగా తయారుచేసుకోవచ్చు.

**మన పెద్దలే గురువులు**

నిజానికి డిజిటల్ డీటాక్స్ ఎలా చేయాలో ఇంట్లో అమ్మమ్మలు, తాతయ్యలు, పెద్దనాన్నలు లాంటి పెద్దవాళ్లను ఎవరిని అడిగినా చెప్తారు. ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగిపోయినా వాళ్లకు అనవసరం. వాళ్లు చేయాల్సిన పనులు శ్రద్ధగా, కచ్చితంగా చేసేవాళ్లు. కుటుంబ సంబంధాలు చక్కగా నెరిపేవాళ్లు. బంధువుల కుటుంబాల్లో జరిగే అన్ని కార్యక్రమాలకూ హాజరయ్యేవారు.అక్కడ అందరితోనూ కలిసి మాట్లాడేవారు. ఇప్పటిలా.. నలుగురూ కలిసినా ఒక్కొక్కరూ ఒక్కో ఫోను పట్టుకుని.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఉండేవారు కాదు. అలాంటి వాళ్లు లేరు అంటారా.. అయితే మీకు మళ్లీ ఫోన్‌లోని డిజిటల్ డీటాక్స్ యాప్‌లే శరణ్యం.

# కృష్ణమ్మ కదలాలి.. గోదారి పారాలి



*కృష్ణా, గోదావరి పరీవాహకాల్లో ప్రాజెక్టులు నోళ్లు తెరుచుకుని చూస్తున్నాయి. రెండు బేసిన్లలోని ప్రాజెక్టులు మొత్తం 641.68 టీఎంసీల మేర ఖాళీగా ఉన్నాయి.*

*రెండు బేసిన్లలోని ప్రాజెక్టులకు 641.68 టీఎంసీలు అవసరం*

*కృష్ణా పరీవాహకంలో స్వల్పంగా ప్రవాహాలు ప్రారంభం*

*ఈ కబురు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి పరీవాహకాల్లో ప్రాజెక్టులు నోళ్లు తెరుచుకుని చూస్తున్నాయి. రెండు బేసిన్లలోని ప్రాజెక్టులు మొత్తం 641.68 టీఎంసీల మేర ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా రావడంతో కృష్ణా పరీవాహకంలో స్వల్పంగా ప్రవాహాలు మొదలైనా గోదావరిలో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. కృష్ణా పరీవాహకంలోని మొత్తం 8 ప్రాజెక్టుల్లో 499.06 టీఎంసీల ఖాళీ ఉంది. కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల్లో వర్షా లకు నదిలో స్వల్పంగా ప్రవాహం వస్తోంది. ఇటీవల జూరాల నిండింది. నారాయణపూర్ కూడా నిండటానికి సమీపంలో ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి జూరాల వైపునకు స్వల్పంగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇక మిగిలిన ప్రాజెక్టులన్నింటిలోనూ నీళ్లు అడుక్కు చేరాయి. కర్ణాటకలోని ఆలమట్టి, నారాయణపూర్‌లకు మరో 70 టీఎంసీలకుపైగా వచ్చి చేరితేనే గానీ దిగువకు పెద్ద ఎత్తున ప్రవాహం విడుదల కాదు. తుంగభద్ర నదిలోనూ సుంకేశుల బ్యారేజీ దిగువన ప్రవాహం ఉంది. అయితే, గతేడాది జూన్ 16వ తేదీతో పోల్చితే నిల్వలు కాస్త మెరుగ్గానే కనిపిస్తున్నాయి. ఏడాది క్రితం శ్రీశైలంలో 35.43 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 64.05 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 122.52 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 137.36 టీఎంసీల నిల్వ ఉంది.*

*గోదావరి పరీవాహకంలో ప్రాజెక్టులన్నీ అడుగంటి పోయాయి. 8 ప్రాజెక్టుల్లో (జాక్వాడీ మినహా) 142.62 టీఎంసీల ఖాళీ ఉంది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్ ప్రాజెక్టులో 66.67 టీఎంసీల ఖాళీ ఉంది. వర్షా లు ముందుగా వచ్చినా.. గోదావరి పరీవాహకంలో మాత్రం ప్రవాహాలు లేవు. గతేడాది ఇదే సమయానికి ఎస్సారెస్పీలో 7.83 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 13.83 టీఎంసీలు ఉన్నాయి.*

# పోలవరం 'టీవోఆర్'ను అడ్డుకోండి

ఈ కబురు, హైదరాబాద్: పోలవరంబనకచర్ల ద్వారా గోదావరి జలాల మళ్లింపు కోసం ప్రాజెక్టు టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్)లో ఏపీ చేసిన మార్పులను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ఆయన సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'బనకచర్ల ప్రాజెక్టు చేపట్టడం ద్వారా ఏపీ పర్యావరణ అనుమతులతో పాటు ట్రైబ్యునల్ నిబంధనలను ఉల్లంఘిస్తోంది. ఇది ముమ్మాటికీ పొరుగు రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలిగించడమే. గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్‌తో పాటు సాంకేతిక సలహా మండలి (టీఏసీ) సూచనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. కేంద్ర పర్యావరణశాఖ నుంచి 2005 అక్టోబరు 25న పోలవరం ప్రాజెక్టుకు అనుమతి లభించింది. అనంతర కాలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే ప్రాజెక్టులో ఏపీ భారీ మార్పులు చేసింది. ఆ పనులు నిలిపివేయాలంటూ కేంద్రం 2011 ఫిబ్రవరి 8న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను వచ్చే ఏడాది జులై 2 వరకు పొడిగించాలి. కీలకమైన అంశాలపై కేంద్ర జలశక్తి, పర్యావరణ మంత్రిత్వ శాఖలు సంబంధిత పక్షాలతో సమావేశం నిర్వహించి చర్చించాలి. ప్రాజెక్టు నిర్మాణం కోసం మొదట ఆమోదించిన ప్రమాణాలను కేంద్రమే ఉల్లంఘిస్తోంది. కుడి కాలువ హెడ్ స్లూయిస్ నీటి విడుదల సామర్థ్యాన్ని 40 వేల క్యూసెక్కులకు పెంచారు. కుడి కాలువలో 11,654 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి డీపీఆర్‌కు ఆమోదం లభించగా.. 17,560 క్యూసెక్కులతో నిర్మిస్తున్నారు. ఎడమ కాలువను కూడా సామర్థ్యానికి మించి నిర్మిస్తున్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) తిరస్కరించాలి'' అని లేఖలో ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఏపీ అక్రమంగా చేపడుతున్న పోలవరంబనకచర్ల ప్రాజెక్టుకు భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మద్దతు ఇస్తున్నారా అని మంత్రి ఉత్తమ్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'ఆదివారం హరీశ్‌రావు నాకు రాసిన లేఖలో పేర్కొన్న విషయాలు చూస్తోంటే ఆ ప్రాజెక్టుకు ఆయన మద్దతు ఇస్తున్నట్లు ఉంది. గోదావరి మళ్లింపు జలాలతో కృష్ణా జలాల్లో 112.5 టీఎంసీల వాటా పొందాలంటూ హరీశ్ సూచన చేశారు. ఇది పూర్తిగా తప్పుడు ఆలోచన. ఎగువ రాష్ట్రాలకు వాటాల కల్పన నికర జలాలకు మాత్రమే వర్తిస్తుంది. వరద నీటికి కాదు. కృష్ణా జలాల్లో 68.5 శాతం వాటా, పోలవరం మళ్లింపుతో వచ్చే వాటా కోసం కేడబ్ల్యూడీటీ2 ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపిస్తోంది. తెలంగాణ ప్రయోజనాల కోసం కాకుండా... రాజకీయ ఉద్దేశంతో హరీశ్‌రావు వ్యవరిస్తున్నారు' అని ఉత్తమ్ విమర్శించారు.

# ఇరాన్ సుప్రీం లీడర్‌ను హతమారిస్తేనే యుద్ధానికి ముగింపు: నెతన్యాహు కీలక వ్యాఖ్యలు



**ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ని హతమారిస్తేనే యుద్ధం ముగుస్తుందన్నారు.**

ఈ కబురు,టెల్ అవీవ్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రతరం అవుతోంది. ఇరుదేశాలు మిస్సైళ్లతో విరుచుకుపడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఇరు దేశాల ప్రజలు ఆందోళనగా ఉన్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు ఈ యుద్ధాన్ని నిశితంగా గమనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ని హతమారిస్తేనే యుద్ధం ముగుస్తుందని పేర్కొన్నారు. ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇరాన్ యుద్ధం గురించి పలు విషయాలను మాట్లాడారు. టెహ్రాన్‌పై టెల్అవీవ్ చేస్తున్న దాడులను ఆయన సమర్థించారు. ఇరుదేశాల మధ్య సంఘర్షణను పెంచేకంటే త్వరగా యుద్ధాన్ని ముగించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని చంపేందుకు ఇజ్రాయెల్ పథకం రచించిందని, అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టెల్అవీవ్ ప్లాన్‌ను తిరస్కరించాడని కథనాలు వచ్చాయి. అలా చేయడం వల్ల ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పరిస్థితి దారుణంగా తయారవుతుందని అందుకే ట్రంప్ 'వీటో' చేసినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీనిపై నెతన్యాహు స్పందిస్తూ.. అలా చేస్తే సంఘర్షణ మరింత పెరగదని, యుద్ధం ముగుస్తుందని పేర్కొన్నారు.

**ఇరాన్ అస్థిరపరిచే శక్తిగా మారింది..**

''చాలా ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఇరాన్ అస్థిరపరిచే శక్తిగా మారింది. అర శతాబ్దంగా ఇరాన్ పాలనతో ప్రతిఒక్కరూ భయపడేవిధంగా సంఘర్షణ వ్యాపించింది. సౌదీ అరేబియాలోని ఆరామ్‌కో చమురు క్షేత్రాలపైనా దాడులు జరిగాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాద వ్యాప్తి, విధ్వంసం, వ్యవస్థలను బలహీనం చేయడం పెరిగి పోయింది'' అని నెతన్యాహు అన్నారు.ఇరాన్ అణు లక్ష్యాలు ప్రపంచానికి ప్రమాదకరమని నెతన్యాహు అభివర్ణించారు. ''మేము కేవలం మా శత్రువుతో మాత్రమే యుద్ధం చేయడం లేదు. వారు ఇజ్రాయెల్‌కు, అమెరికాకు మరణం అని నినాదాలు చేస్తున్నారు. మేము సైతం వారి దారిలోనే నడుస్తున్నాం. ఇది త్వరలో అమెరికాకు కూడా చేరుతుంది. ఇరాన్ చేపట్టిన 'శాశ్వత యుద్ధం'ను అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ చర్యలు చేపట్టింది. ఇరాన్ చేపట్టిన శాశ్వత యుద్ధం ప్రపంచాన్ని అణు విపత్తు వైపు నెడుతోంది. అయితే దురాక్రమణను అంతం చేయడం, దుష్ట శక్తులకు ఎదురించి పోరాడడం ద్వారా ఇజ్రాయెల్ దాన్ని అడ్డుకుంటోంది'' అని నెతన్యాహు అన్నారు.

మరోవైపు ఇరాన్ అణు కార్యక్రమం, శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకొని వారిని 'హిట్లర్ అణు బృందం'గా నెతన్యాహు పోల్చాడు. వారితో ప్రపంచానికి పెనుముప్పు పొంచి ఉందన్నారు. 'ఈరోజు టెల్ అవివ్, రేపు న్యూయార్క్ కావొచ్చు' అని అన్నారు. తన అభిప్రాయం ప్రకారం ఇరాన్ దృష్టిలో అమెరికానే తొలి లక్ష్యం అని తెలిపారు. ఆ చర్చలు నకిలీవి.. అమెరికాను ఇరకాటంలో పెట్టేవి..మరోవైపు ఇరాన్ దౌత్య చర్యలను నెతన్యాహు తోసిపుచ్చారు. అవి తప్పుదారి పట్టించేవన్నారు. వారు అబద్ధాలు, మోసంతో నకిలీ చర్చలను కొనసాగించి అమెరికాను ఇరకాటంలో పెట్టాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇరాన్ ఉద్దేశాలపై ఇజ్రాయెల్‌కు కచ్చితమైన నిఘా ఉందన్నారు. ఇరాన్ పెంచుతున్న క్షిపణుల తయారీ, అణు కార్యక్రమం కేవలం ఇజ్రాయెల్‌కు మాత్రమే ముప్పు కాదని, అరబ్ దేశాలు, యూరప్, అమెరికాకు సైతం ముప్పే అన్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచినందుకు అమెరికాకు, అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కొన్నిసార్లు దుష్ట శత్రువుకు వ్యతిరేకంగా పోరాడాలి. దాన్ని అమెరికా ప్రజలు సహజంగానే అర్థం చేసుకుంటారు. అమెరికా అధ్యక్షుడు సైతం దాన్ని అర్థం చేసుకున్నారు. అందుకు అండగా నిలబడ్డారు అని నెతన్యాహు పేర్కొన్నారు.

మరోవైపు ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. ఈశాన్య టెహ్రాన్‌లోని అండర్‌గ్రౌండ్ బంకర్‌లో ఖమేనీ కుటుంబంతో కలిసి తలదాచుకున్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# రాష్ట్రంలో వైద్య కళాశాలల భవితవ్యాన్ని కాపాడండి

**భారాస ప్రభుత్వం ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం రేవంత్ పాలనలో ప్రశ్నార్థకంగా మారుతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు.**

మాజీ మంత్రి హరీశ్‌రావు

ఈ కబురు, హైదరాబాద్: భారాస ప్రభుత్వం ముందు చూపుతో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం రేవంత్ పాలనలో ప్రశ్నార్థకంగా మారుతోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ''26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సౌకర్యాలు, వసతులు నిబంధనలకు అనుగుణంగా లేవని, ఈ నెల 18న హెల్త్ సెక్రటరీ, డీఎంఈలు తమ ముందు ప్రత్యక్షంగా హాజరు కావాలని ఎన్ఎంసీ తాఖీదులు ఇవ్వడం ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం. ముఖ్యమైన ఈ విషయంపై ఆలస్యంగా మేల్కొన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు కమిటీ వేయడం హాస్యాస్పదం. ముఖ్యమంత్రి పరిపాలనను గాలికి వదిలేసి.. ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారు. వందల మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు భరోసా? ఇప్పటికైనా తక్షణమే మెడికల్ కళాశాలలకు కావాల్సిన నిధులను విడుదల చేయాలి'' అని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.



# జియోకి ఏమైంది?
## గగ్గోలు పెడుతున్న యూజర్లు




ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ రిలయన్స్ జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయాలు తలెత్తాయి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, మొబైల్ సిగ్నల్, జియో ఫైబర్ సేవలకు సంబంధించిన సమస్యల గురించి వేలాది మంది నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దేశంలోని కేరళ ప్రాంతంలో జియో నెట్‌వర్క్ ద్వారా కాల్స్, ఇంటర్నెట్ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురైనట్లు అనేక మంది సోషల్ మీడియా వేదికగా నివేదిస్తున్నారు.

ఇప్పటివరకు 12,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయని అంతరాయాల ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ తెలిపింది. ఇందులో ఎక్కువ ఫిర్యాదులు మొబైల్ డేటా వైఫల్యాలకు సంబంధించినవే. 32 శాతం మంది యూజర్లు కాల్ సంబంధిత సమస్యలను నివేదించగా, 12 శాతం మంది వినియోగదారులు జియో ఫైబర్ సేవల్లో అంతరాయం కలిగినట్లు ఫిర్యాదు చేశారు.

మధ్యాహ్నం 1:45 గంటలకు ఈ సమస్య ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఆ సమయానికి దాదాపు 400 మంది వినియోగదారులు జియో సేవలను యాక్సెస్ చేసేటప్పుడు సమస్యలను నివేదించారు. తర్వాత మధ్యాహ్నం 2:15 గంటలకు కేరళ ప్రాంతం నుంచి గణనీయమైన సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే కేరళ ప్రాంతంలో మాత్రమే కొంత సమయం నెట్ వర్క్‌లో సమస్యలు వచ్చాయని, దేశంలోని మిగిలిన ప్రాంతాలలో ఎటువంటి సమస్యా లేదని జియో వర్గాలు వెల్లడించాయి.




# కోతల రాయుళ్లకు వాతలు తప్పవు!




ఐటీఆర్ 1, ఐటీఆర్ 4లలో కొన్ని మార్పులు చేశారు. ఈ మార్పులన్నీ మీరు ఐటీఆర్ దాఖలు చేసే 2024-25 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తాయి. ఈ మార్పుల ప్రకారం క్లెయిం చేసే ప్రతి డిడక్షన్‌కి సంబంధించిన పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలి. ఇన్నాళ్లు డిడక్షన్ ఎంతో రాసిస్తే వదిలేసేవారు. ఇక నుంచి పూర్తి వివరాలు ఇవ్వాల్సిందే. దీని ప్రకారం ఒక్కొక్క డిడక్షన్, దానికి సంబంధించిన కాగితాలు/వివరాలు ఏమిటో తెలుసుకుందాం. మీ దగ్గర పూర్తి వివరాలు లేనిదే ఫారం నింపలేరు. ఇంటి అద్దె అలవెన్సు.. బేసిక్ జీతం. ఇంటి అద్దె అలవెన్సు ఎంత చేతికి వచ్చింది. మీరు అద్దె ఎంత చెల్లించారు. అద్దె ఎవరికి ఇచ్చారు. ఎలా ఇచ్చారు. అంటే నగదా..? బ్యాంకు ద్వారానా..? రశీదులు మొదలైనవి.

**80 సీ.. ఇంతకుముందే తెలుసుకున్నాము. ఈ సెక్షన్ క్రింద ఎన్నో అంశాలున్నాయి.** ముఖ్యంగా పాలసీ నెంబరు చెప్పాలి. అలాగే మిగతా ఇన్వెస్ట్‌మెంట్లకు, డాక్యుమెంటు ఐడెంటిఫికేషన్ నెంబరు రాయాలి. మిగతా వాటి గురించి ఇక్కడ ప్రస్తావించలేదు కానీ క్లెయిం చేసే ముందు కాగితాలు సిద్ధంగా పెట్టుకోవాలి. చెల్లింపు తేదీలు, అది ఏ సంవత్సరానికి సంబంధించినదో చాలా ముఖ్యం. ఈ సెక్షన్‌లో డిడక్షన్లు చెల్లింపు జరిగిన సంవత్సరంలోనే బెనిఫిట్ ఇస్తారు.

80 డీ.. ఇది మెడికల్ ఇన్సూరెన్స్‌కి సంబంధించినది. ఇన్సూరెన్స్ కంపెనీ పేరు, పాలసీ నెంబరు వివరాలు ఇవ్వాలి.

**80 ఈ... ఇది విద్యా రుణానికి సంబంధించినది. ఏ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు..?** లోన్ అకౌంటు నెంబరు.., మంజూరు తేది ..
ఎంత రుణం తీసుకున్నారు.. ఇంకా
ఎంత రుణం చెల్లించాలి .. ఇలా వివరాలన్నీ తెలియపరచాలి.

80 ఈఈ... ఇంటి కోసం రుణం తీసుకుంటే కొన్ని షరతులకు లోబడి రూ.50,000 డిడక్షన్ ఇస్తారు. ఈ రుణానికి సంబంధించి బ్యాంకు, లోన్ అకౌంటు నెంబరు, మంజూరు లెటర్ తేదీ, ఎంత రుణం తీసుకున్నారు..? ఇంకా ఎంత రుణం మిగిలి ఉంది. ఇవన్నీ వివరాలు చెప్పాలి.

**80 ఈఈబీ...** ఇది ఎలక్ట్రిక్ వెహికల్ లోన్‌కి సంబంధించినది. బ్యాంకు పేరు ఏమిటి..? లోన్ అకౌంటు నెంబరు, లోన్ ఎంత, వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబరు, లోన్ మొత్తం ఎంత..? మొదలైన వివరాలు ఇవ్వాలి.

**80 డీడీబీ... ఇది కొన్ని నిర్దేశిత జబ్బుల ట్రీట్‌మెంట్‌కి సంబంధించినది.** ఆ నిర్దేశిత జాబితాలోంచి ఏ జబ్బు వచ్చింది? దానికైన ఖర్చు.., హాస్పిటల్‌కి చెల్లించిన మొత్తం ఎంత? తదితర పూర్తి వివరాలు తెలిపాలి.

ఈ మార్పులతో అన్ని విషయాలు సేకరిస్తున్నారన్న మాట. ఒకప్పుడు మన మీద అభిమానం, నమ్మకం, మంచి విశ్వాసంతో మొత్తాన్ని తెలియజేయమనేవారు. దీనిని ఆసరా తీసుకుని అన్ని సెక్షన్ల ప్రకారం అర్హత ఉన్నంత క్లెయిమ్‌ల కోసం జనాలు ఎగబడుతున్నారు. అద్దె ఇంట్లో లేకుండా అద్దె క్లెయిమ్ చేసే ఉద్యోగస్తులు ఎందరో ఉన్నారు. భార్యభర్తలు ఒకే ఇంట్లో ఉంటూ ఇద్దరూ విడిగా వారి వారి అస్సెస్‌మెంట్లలో హెచ్‌ఆర్ఏ క్లెయింలు చేసే 'మేడ్ ఫర్ ఈచ్ అదర్స్' ఎంతోమంది ఉన్నారు. ఒక్క హెచ్‌ఆర్ఏ విషయంలోనే డిపార్ట్‌మెంట్ వారు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తే కొంప కొల్లేరు అయిపోతుంది. అలాగే దొంగ స్కూల్ ఫీజుల రశీదులు .. పిల్లలు లేని వారు కూడా దొంగ రశీదులు పెడుతున్నారు. జీవిత బీమా చెల్లించకపోయినా ప్రీమియంలు చెల్లించినట్లు రాయడం, లేని చెల్లింపులు, లేని ఇన్వెస్ట్‌మెంట్లు, లేని అంగవైకల్యం దొంగ పత్రాలు సృష్టించి తద్వారా క్లెయిమ్‌లు పొందడం లాంటివి చేసేవారున్నారు. డిపార్ట్‌మెంట్ చాలా స్ట్రిక్ట్‌గా ఉందని తిట్టి, ప్రచారం చేసి డిపార్ట్‌మెంట్ వారి మీద అపవాదాలు వేసి, పిడివాదన చేసి, వాదనలు, ప్రతివాదనలు చేసి, పన్నుభారం తగ్గించుకునే కోతరాయుళ్లకి వాతలు తప్పవు. **




# ఉద్యోగాల కోతకు ఏఐ సాకు!

కృత్రిమమేధకు ఆదరణ పెరుగుతున్న కొద్దీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో గుబులు అధికమవుతోంది. తమ ఉద్యోగాల స్థానంలో ఏఐ పాగా వేస్తుందని చాలామంది జంకుతున్నారు. ఇదే అదనుగా కొన్ని కంపెనీలు కాస్ట్ కటింగ్, పునర్వ్యవస్థీకరణ పేరుతో ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలపర్ల స్థానాన్ని ఏఐ భర్తీ చేస్తుందని చెబుతూ కొన్ని కంపెనీల వ్యవస్థాపకులు, సీఈఓలు తమ మోడళ్ల అమ్మకాలను పెంచుకోవడానికి ఎక్కువగా ప్రచారం చేస్తున్నట్లు ఏఐ కోడింగ్ ప్లాట్‌ఫామ్ విండ్సర్ఫ్ వ్యవస్థాపక బృందం సభ్యుడు అన్షుల్ రామచంద్రన్ తెలిపారు.

'ఏఐ ప్రభావం పెరుగుతోందని చెబుతున్నవారిలో చాలా మంది ఎలాగైనా కొందరు ఉద్యోగులను తొలగించాలని కోరుకుంటున్నారు. అందుకు ఏఐను సాకుగా వాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ కోసం ప్రత్యేకంగా ఏఐ నమూనాలను రూపొందిస్తున్నారు. మరిన్ని మోడళ్లను విక్రయించడానికి ఇది వ్యాపార వ్యూహంగా పని చేస్తుంది. డెవలపర్ అడాప్షన్, ఎంటర్‌ప్రైజ్ పార్ట్‌నర్‌షిప్ పరంగా అమెరికా తర్వాత భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరిస్తోంది. భారత్‌లో 1.7 కోట్ల మంది డెవలపర్లు ఉన్నారు' అని చెప్పారు.

'వాస్తవంగా కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడానికి భారత్‌కు సరిపడా శక్తి ఉంది. భారత్‌లో జీపీయూ క్లస్టర్లను నిర్మించడంపై చురుగ్గా ముందుకెళ్తున్నాం. ఇప్పటికే భారత్‌లోని ప్రముఖ ఐటీ కంపెనీలతో వివిధ స్థాయిల్లో కలిసి పనిచేస్తున్నాం. ఇండియన్ ఐటీ కంపెనీలు తమ అంతర్జాతీయ సహచరుల కంటే వేగంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయి. అయితే ఈ కంపెనీలు ఇప్పటికే టెక్నాలజీని వివిధ విభాగాల్లో వైవిధ్యపరిచాయి' అని రామచంద్రన్ తెలిపారు.






# లాభాల్లో ముగిసిన మార్కెట్లు..
## ప్చ్.. టాటా మోటర్స్ మాత్రం..

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణ నేపథ్యంలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత ఈక్విటీ మార్కెట్లు నిలకడగా ఉండి, వేగంగా పుంజుకున్నాయి. బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 దాదాపు 1 శాతం చొప్పున పెరిగాయి.ఇంట్రాడేలో 81,865.82 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్ 677.55 పాయింట్లు (0.84 శాతం) పెరిగి 81,796.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 అయితే ఏకంగా 227.9 పాయింట్లు లేదా 0.92 శాతం ఎగిసి 24,946.50 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.93 శాతం, 0.95 శాతం లాభాలతో ముగిశాయి.

రంగాల వారీగా చూస్తే అన్ని రంగాలు లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఐటీ, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్ సూచీలు వరుసగా 1.57 శాతం, 1.32 శాతం, 1.11 శాతం, 1.07 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ బ్యాంక్, ఎనర్జీ, మీడియా, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఫార్మా షేర్లు లాభాల్లో ముగిశాయి.సెన్సెక్స్ షేర్లలో అల్ట్రాటెక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు 2.4 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు టాటా మోటార్స్, సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్ మాత్రమే నష్టపోయాయి. టాప్ లూజర్ గా నిలిచిన టాటా మోటార్స్ 3.76 శాతం నష్టపోయింది.

మార్కెట్లలో అస్థిరతను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 1.6 శాతం క్షీణించి 14.83 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక క్రూడాయిల్ ధరలు సోమవారం స్వల్పంగా తగ్గాయి. డబ్ల్యూటీఐ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 0.6 శాతం తగ్గుదలతో 72.56 డాలర్లకు క్షీణించింది.



# బంగారం ధరల్లో స్వల్ప ఊరట..
## తులం ఎంతంటే..



**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర సోమవారం కాస్తా ఊరటనిచ్చింది. వివిధ ప్రాంతాల్లో ఈ రోజు గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.**

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.93,050 (22 క్యారెట్స్), రూ.1,01,510 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. క్రితం రోజు ముగింపు ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.150, రూ.170 తగ్గింది.

చెన్నైలో సోమవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.150, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.170 తగ్గింది. దీంతో గోల్డ్ రేటు రూ.93,050 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.1,01,510 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే తగ్గింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.150 దిగి రూ.93,200కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.170 తగ్గి రూ.1,01,660 వద్దకు చేరింది.

**వెండి ధరలు**

బంగారం ధరలు సోమవారం తగ్గినట్లుగానే వెండి ధరలు కూడా వినియోగదారులకు కొంత ఊరట కల్పించాయి. క్రితం ముగింపు ధరలతో పోలిస్తే కేజీ వెండి ధరపై రూ.100 తగ్గింది. దాంతో కేజీ వెండి రేటు రూ.1,19,900 వద్దకు చేరింది.

# డైరెక్ట్‌గా ఓటీటీలోకి కీర్తి సురేశ్ సుహాస్ మూవీ.. ఎక్కడంటే?

తెలుగులో ఫేమస్ పద్యాల్లో 'ఉప్పు కప్పురంబు.. నొక్క పోలికనుండు' ఒకటి. ఈ పద్యాన్నే టైటిల్‌గా పెట్టుకుని ఓ సినిమా వచ్చేస్తోంది. హీరోయిన్ కీర్తి సురేశ్ హీరో సుహాస్ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ ఉప్పు కప్పురంబు. ఈ చిత్రం థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలోనే రిలీజ్ కానుంది. అమెజాన్ ప్రైమ్ తన ఓటీటీ ప్లాట్‌ఫామ్ కోసం రూపొందించిన ఒరిజినల్ మూవీ ఇది.

**ఓటీటీలో..**

ఐవి శశి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎల్లనార్ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రాధికా లావు నిర్మించారు. సినిమా బండి ఫేమ్ వసంత్ కథ అందించారు. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. జూలై 4న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్ రిలీజ్ చేశారు. చిట్టి జయపురం గ్రామవాసులు అందించే వినోదాల విందుకు సిద్ధంగా ఉండమని ప్రైమ్ వీడియో ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది.







# జరిగితే ఈ ఏడాదిలో పెళ్లి.. లేదంటే మాత్రం!

సినిమా సెలబ్రిటీలు ప్రేమ, పెళ్లి అనేది ఇంట్రెస్టింగ్ టాపిక్. దీని గురించి ఏ చిన్న రూమర్ వినిపించినా సరే అభిమానులు ఎగ్జైట్ అవుతుంటారు. కొన్నిసార్లు కొందరు జ్యోతిషులు.. పలువురు నటీనటుల భవిష్యత్ గురించి అంచనా వేసి చెబుతుంటారు. కొన్నిసార్లు ఇది నిజమైతే, కొన్నిసార్లు ఇది జరగదు. గతంలో వేణుస్వామి ఎంత రచ్చ చేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ సుశీల్ కుమార్ అనే జ్యోతిషుడు.. హీరోయిన్ జాన్వీ కపూర్ పెళ్లి గురించి కామెంట్స్ చేశాడు.

సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన సదరు జ్యోతిషుడు.. జాన్వీ కపూర్ కెరీర్ 2026లో మంచి స్థాయికి వెళ్తుందని చెప్పారు. అలానే ఈ ఏడాదిలోనే జాన్వీ పెళ్లి చేసుకుంటుందని, ఒకవేళ లేదంటే మాత్రం 33 ఏళ్లకు ఆమెకు వివాహం జరుగుతుందని అంచనా వేశాడు. ఓవైపు ఆమె వైవాహిక జీవితం సాఫీగా ఉంటుందని చెబుతూన.. గ్రహగతుల వల్ల కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశముందని అభిప్రాయపడ్డాడు.

ఏదేమైనా ఇప్పుడు జ్యోతిషుడు సుశీల్ కుమార్ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. జాన్వీ కపూర్‌కి బాయ్ ఫ్రెండ్ ఉన్నమాట నిజమే. గతంలో ఇతడితోనే పలుమార్లు తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంది. గతంలో ఓసారి మాట్లాడుతూ.. తాను పెళ్లి చేసుకుని తిరుపతిలోనే సెటిల్ కావాలనుకుంటున్నానని జాన్వీ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె చేతిలో రామ్ చరణ్ 'పెద్ది', బన్నీఅట్లీ ప్రాజెక్ట్ తదితర క్రేజీ మూవీస్ ఉన్నాయి. ఇలాంటి టైంలో పెళ్లి చేసుకుంటుందా అంటే కచ్చితంగా లేదని చెప్పొచ్చు. మరి సదరు జ్యోతిషుడు ఏ అంచనాతో చెప్పాడో ఏమో?

# నేటి జనరేషన్‌కు నాగ్ గొప్ప సలహా.. అదేంటంటే?



దేశంలో అత్యంత ధనిక హీరోల్లో కింగ్ నాగార్జున ఒకరు. షారూఖ్ ఖాన్, జూహీ చావ్లా తర్వాత రూ.3500 కోట్ల సంపదతో ఈయన మూడో స్థానంలో ఉన్నట్లు ఆ మధ్య వార్తలు వెలువడ్డాయి. వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పాటు వ్యాపార రంగంలో పెట్టుబడులు ఆయన సంపదను మరింత పెంచాయి. తాజాగా నాగ్ జెన్ జెడ్ కు విలువైన సలహా ఇచ్చాడు.

డబ్బు ఎప్పుడు సంపాదిస్తారు?

కుబేర సినిమా ఈవెంట్‌లో యాంకర్ సుమ మాట్లాడుతూ.. జెన్ జెడ్ ఫోన్ రీచార్జులపై ఎక్కువ ఖర్చు పెడుతోంది. అసలేం చేయాలి? ఏం చేయకూడదు? అనేది ఓ సలహా ఇవ్వమని నాగార్జునను అడిగింది. అందుకాయన క్షణం ఆలోచించకుండా ఫోన్ చూడటం ఆపేయండి. పొద్దున్నుంచి సాయంత్రం వరకు ఫోన్ చూస్తూ కూర్చుంటే డబ్బులు సంపాదించేందుకు సమయం ఎక్కడుంది? అని చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారగా.. ఇదేంటి? ఈ సలహా నాకే చెప్తున్నట్లు ఉందని పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

సినిమా

నాగార్జున చివరగా నా సామిరంగ సినిమాలో నటించాడు. ప్రస్తుతం కుబేర, కూలీ చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నాడు. ఇవి రెండు కూడా మల్టీస్టారర్ చిత్రాలే కావడం విశేషం. ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కుబేరకు శేఖర్ కమ్ముల డైరెక్టర్. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా జిమ్ సర్భ్ ముఖ్య పాత్ర పోషించింది. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించారు. జూన్ 20న ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతోంది.

# టాలీవుడ్ నటి మన్నారా చోప్రా ఇంట్లో తీవ్ర విషాదం

టాలీవుడ్ నటి, బిగ్ బాస్ కంటెస్టెంట్ మన్నారా చోప్రా ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆమె తండ్రి రమణ్ రాయ్ హండా తుదిశ్వాస విడిచారు. ఆయన 72 సంవత్సరాల వయసులో అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషాద వార్తను నటి సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ మృతిచెందారు. అంత్యక్రియలు జూన్ 18న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాగా.. రమణ్ రాయ్ హండా బాలీవుడ్ హీరోయిన్స్ ప్రియాంక చోప్రా, పరిణీతి చోప్రాలకు మామ అవుతారు. ఆయనకు భార్య కామినీ చోప్రా, కుమార్తెలు మన్నారా, మితాలి చోప్రా ఉన్నారు. ఆయన ఢిల్లీ హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ప్రియాంక, పరిణీతి చోప్రాల అత్త కామిని చోప్రాను వివాహం చేసుకున్నారు. కాగా.. మన్నారా థ్రిల్లర్ జిద్ అనే మూవీతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, పంజాబీ భాషల సినిమాల్లో నటించింది. తెలుగులో "ప్రేమ గీమ జాంత నై" చిత్రంతో పరిచయమైంది. ఆ తర్వాత సునీల్‌తో "జక్కన్న", సాయి ధరమ్ తేజ్‌తో "తిక్క" వంటి సినిమాల్లో నటించింది. అలాగే "రోగ్", "సీత" చిత్రాల్లో కూడా కనిపించింది. గతేడాది తెలుగులో రాజ్ తరుణ్ సరసన తిరగబడరా సామీ చిత్రంలో కనిపించనుంది. అంతే కాకుండా హిందీ బిగ్ బాస్ సీజన్-17లో టాప్-3 కంటెస్టెంట్స్‌లో ఒకరిగా నిలిచింది.



# సెట్‌లోనే ఆ హీరోతో పెళ్లి.. జెనీలియా రియాక్షన్!



బొమ్మరిల్లు హీరోయిన్ జెనీలియా తెలుగువారికి సుపరిచితమైన పేరు. టాలీవుడ్ సినిమాల్లో నటించిన ముద్దుగుమ్మ ఆ తర్వాత నటుడు రితేశ్ దేశ్‌ముఖ్‌ను పెళ్లాడింది. పెళ్లి తర్వాత దాదాపు సినిమాలకు దూరమైంది. ప్రస్తుతం అమిర్ ఖాన్ చిత్రం సితారే జమీన్ పర్‌లో కనిపించనుంది. ఆమిర్ ఖాన్ హీరోగా నటించిన ఈ చిత్రం జూన్ 20న విడుదల కానుంది.అయితే గతంలో హీరో జాన్ అబ్రహంతో జెనీలియా పెళ్లి జరిగిందన్న వార్తలొచ్చాయి. దాదాపు 14 ఏళ్ల క్రితం జరిగిన ఈ ప్రచారంపై తాజాగా జెనీలియా స్పందించారు. ఆ వార్తలు ఎవరో సృష్టించారో తనకు తెలుసన్నారు. దానికి వాళ్లే సమాధానం చెప్పాలన్నారు. తాజా ఇంటర్వ్యూలో జెనీలియా మాట్లాడుతూ..'బాలీవుడ్ నటుడు జాన్ అబ్రహం.. నే ఓ ప్రాజెక్ట్ కోసం కలిసి వర్క్ చేశాం. ఆ సినిమా సెట్‌లో అనుకోకుండా మా పెళ్లి జరిగిందంటూ అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే అదంతా కేవలం రూమర్స్ మాత్రమే. అందులో ఎలాంటి వాస్తవం లేదు. మాకు పెళ్లి జరగలేదు. కొంతమంది పీఆర్‌లు ఇలాంటి చెత్త న్యూస్ క్రియేట్ చేశారు. ఇలాంటి వార్తలు ఎందుకు ప్రచారం చేశారో వారినే అడగండి' అని అన్నారు. కాగా.. జెనీలియా - జాన్ అబ్రహం జంటగా ఫోర్స్ అనే చిత్రంలో నటించారు. ఈ సినిమా 2011లో విడుదల కాగా.. ఓ సీన్‌లో భాగంగా వీరిద్దరికీ నిజంగానే పెళ్లి చేశారంటూ తెగ వైరలైంది. ఆ కథనాలకు చెక్ పెడుతూ ఆ తర్వాత ఏడాదిలోనే రితేశ్ దేశ్‌ముఖ్‌ను పెళ్లాడారు.



# రిటైర్ అయిపోయి లీగ్స్ ఆడుకో.. కరుణ్ నాయర్‌కు ప్రముఖ క్రికెటర్ సలహా!

అద్భుతమైన ఆటతో టీమిండియాలో పున రాగమనం చేసిన కరుణ్ నాయర్ సంచలన విషయం వెల్లడించాడు. రెండేళ్ల క్రితం ఒక ప్రముఖ క్రికెటర్ తనను రిటైర్ అవ్వాలని సూచించినట్లు చెప్పాడు. 'ఒక ప్రముఖ క్రికెటర్ నాకు కాల్ చేశాడు. లీగ్ క్రికెట్ ఆడితే వచ్చే డబ్బులతో సెక్యూర్డ్ జీవితం గడపొచ్చు. ఇక రిటైర్ అయిపోయి లీగ్స్ మీద ఫోకస్ పెట్టు' అని సలహా ఇచ్చినట్లు నాయర్ వెల్లడించాడు. అలా చేయడం సులభమే అయినా, ఆ పని చేస్తే ఫ్యూచర్‌లో తను చాలా బాధ పడతానని, అందుకే ఆ నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాడీ 33 ఏళ్ల క్రికెటర్. 'భారత్‌కు ఆడే అవకాశం ఉన్నంత వరకు నేను ఆ ఛాన్స్ వదులుకోను. ఇది జరిగి రెండేళ్లయింది. ఇప్పుడు నా కల నిజమైంది కదా. ఇదంతా నమ్మశక్యంగా ఉండదు. కానీ నేను మంచి ప్లేయర్‌ను అని నాకు తెలుసు' అని నాయర్ వెల్లడించాడు. దేశవాళీల్లో నిలకడగా అదిరిపోయే ఇన్నింగ్సులు ఆడిన నాయర్.. అన్ని ఫార్మాట్లలో చెలరేగాడు. ఈ క్రమంలోనే ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికయ్యాడు. మొదటి ప్రాక్టీస్ మ్యాచులో డబుల్ సెంచరీతో మెరిసి, జూన్ 20న జరిగే తొలి టెస్టులో తన స్థానం దాదాపు కన్ఫర్మ్ చేసుకున్నాడు.

# మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల.. భారత్, పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?




భారత్ వేదికగా ఈ ఏడాది జరగనున్న మహిళల వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుంది. సెప్టెంబరు 30న భారత్, శ్రీలంక మ్యాచుతో టోర్నీ మొదలవుతుంది. ఈ మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగుతుంది. అయితే భారత్, పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బాగా దెబ్బతినడంతో ఈ రెండు దేశాల మధ్య మ్యాచులను మాత్రం తటస్థ వేదికపై నిర్వహించాలని ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో ఐసీసీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్, పాకిస్తాన్ మహిళల జట్లు అక్టోబరు 5న కొలంబో వేదికగా తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా తమ తొలి మ్యాచులో అక్టోబరు 1న న్యూజిల్యాండ్‌తో తలపడనుంది.రౌండ్ రాబిన్ మ్యాచులు అక్టోబర్ 26 వరకు జరుగుతాయి. అనంతరం అక్టోబర్ 29, 30 తేదీల్లో సెమీఫైనల్స్, ఆ తర్వాత నవంబరు 2న ఫైనల్స్ నిర్వహించనున్నట్లు ఐసీసీ వెల్లడించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచులకు గువాహతి, బెంగళూరు స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. అయితే నాకౌట్ దశకు పాకిస్తాన్ చేరితే మాత్రం ఈ మ్యాచులు కొలంబోలో జరుగుతాయి. లేదంటే నాకౌట్ మ్యాచులన్నీ భారత్‌లోనే నిర్వహిస్తారు. ఈ షెడ్యూల్ కన్ఫర్మ్ అవడంతో మహిళల వన్డే వరల్డ్ కప్ 13వ ఎడిషన్‌పై ఆసక్తి మరింత పెరుగుతుందని ఐసీసీ చైర్మన్ జై షా అభిప్రాయపడ్డారు. మహిళా క్రికెట్లోని 8 బెస్ట్ టీమ్స్.. ఈ టోర్నీ కోసం భారత్‌కు వస్తాయని, ఈ అద్భుతమైన ఈ మెగా ఈవెంట్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని తెలిపారు.

**రౌండ్ రాబిన్..**

ఈ దశలో ప్రతి జట్టు మిగతా ఏడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ఈ మ్యాచుల తర్వాత టాప్ 4లో నిలిచిన జట్లు సెమీస్ చేరతాయి. అలాగే ప్రతి జట్టు ఈ మెగా ఈవెంట్‌కు ముందు రెండేసి వార్మప్ మ్యాచులు ఆడుతుంది. సెప్టెంబరు 24 నుంచి ఈ వార్మప్ మ్యాచులు మొదలవుతాయి.

# వరుసగా ఆరో పరాజయం

**మళ్లీ ఓడిన భారత పురుషుల హాకీ జట్టు**
**ఆధిక్యంలోకి వెళ్లి వెనుకంజ**
**కెరీర్‌లో 400వ మ్యాచ్ ఆడిన మన్‌ప్రీత్**

**ఆంట్‌వర్ప్ (బెల్జియం):** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) యూరోపియన్ అంచె ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. హార్దిక్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు యూరోపియన్ అంచెలో వరుసగా ఆరో పరాజయాన్ని చవిచూసింది. ఆస్ట్రేలియా జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌కు ముందు నెదర్లాండ్స్‌తో రెండు మ్యాచ్‌ల్లో, అర్జెంటీనాతో రెండు మ్యాచ్‌ల్లో, ఆస్ట్రేలియాతో ఒక మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి పాలైంది.

ఆస్ట్రేలియాతో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత జట్టు మ్యాచ్ మొదలైన మూడో నిమిషంలోనే ఖాతా తెరిచింది. సంజయ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఆధిక్యంలోకి వెళ్లామన్న ఆనందం భారత్‌కు మరుసటి నిమిషంలోనే ఆవిరైంది. రెండు నిమిషాల వ్యవధిలో ఆస్ట్రేలియా రెండు గోల్స్ చేసి భారత్‌కు షాక్ ఇచ్చింది. నాలుగో నిమిషంలో టిమ్ బ్రాండ్, ఐదో నిమిషంలో బ్లేక్ గోవర్స్ ఆస్ట్రేలియాకు ఒక్కో గోల్ అందించారు. రెండో క్వార్టర్‌లో భారత్ మూడో గోల్ సమర్పించుకుంది.

18వ నిమిషంలో కూపర్ బర్న్స్ గోల్‌తో ఆస్ట్రేలియా 3-1తో ముందంజ వేసింది. మూడో క్వార్టర్‌లో దిల్‌ప్రీత్ సింగ్ గోల్‌తో భారత్ ఈ ఆధిక్యాన్ని 2-3కు తగ్గించింది. అనంతరం భారత జట్టు స్కోరును సమం చేసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా చివరి పది నిమిషాల్లో మూడు పెనాల్టీ కార్నర్‌లు సంపాదించినా భారత గోల్‌కీపర్ కృషన్ బహదూర్ పాఠక్ నిర్వీర్యం చేశాడు. ఓవరాల్‌గా మ్యాచ్‌లో భారత జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు రాగా ఒక్క దానిని సద్వినియోగం చేసుకుంది.

మరోవైపు ఆస్ట్రేలియాకు ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు రాగా ఆ జట్టు కూడా ఒక్క దానిని లక్ష్యానికి చేర్చింది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ద్వారా భారత మాజీ కెప్టెన్, మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్ కెరీర్‌లో 400 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. మొత్తం తొమ్మిది జట్లు పోటీపడుతున్న 2024-2025 ప్రొ లీగ్‌లో భారత జట్టు 14 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి, తొమ్మిది మ్యాచ్‌ల్లో ఓడింది. 15 పాయింట్లతో ఏడో స్థానంలో ఉంది. భారత జట్టు తమ చివరి రెండు మ్యాచ్‌లను బెల్జియం జట్టుతో (జూన్ 21న, 22న) ఆడుతుంది.






# జోరూట్ మరో 373 పరుగులు చేస్తే...

**ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ జోరూట్‌ను రికార్డులు ఊరిస్తున్నాయి. భారత్, ఇంగ్లండ్ మధ్య జూన్ 20 నుంచి జరగనున్న టెస్ట్ సిరీస్‌లో మరో 373 పరుగులు చేస్తే రికీపాంటింగ్‌ను అధిగమించే అవకాశం ఉంది.**

ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ జోరూట్‌ను రికార్డులు ఊరిస్తున్నాయి. అతడు ఇప్పటి వరకు 153 టెస్ట్‌మ్యాచ్‌లు ఆడి 50.80 యావరేజ్‌తో 13,006 పరుగులు చేశాడు. ఇందులో 36 సెంచరీలు, 65 అర్ధశతకాలున్నాయి. సచిన్ టెస్టుల్లో నెలకొల్పిన 15,921 పరుగుల రికార్డును భవిష్యత్తులో అధిగమించే అవకాశం ప్రస్తుతం జోరూట్ ఒక్కడికే ఉంది! అలాగే భారత మాజీ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్‌ను కూడా యావరేజ్ విషయంలో అధిగమించే అవకాశం ఉంది.

జూన్ 20 నుంచి టీమ్ఇండియాతో ఇంగ్లండ్ అయిదు టెస్ట్‌మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌లో జోరూట్ మరో 373 పరుగులు చేస్తే ఆసీస్ దిగ్గజం రికీపాంటింగ్‌ను అధిగమించే అవకాశం ఉంది. తన కెరీర్‌లో 168 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన పాంటింగ్ 51.85 యావరేజ్‌తో 13,378 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లో జోరూట్ ఈ రికార్డు సాధించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది! ఎందుకంటే స్వదేశంలో జోరూట్‌కు టీమ్ఇండియా మీద మంచి రికార్డు ఉంది. హోం కండీషన్స్‌లో 15 టెస్టులు, 25 ఇన్నింగ్స్‌ల్లో జోరూట్ ఏకంగా 74.95 యావరేజ్‌తో 1,574 పరుగులు చేశాడు. ఇందులో ఏడు సెంచరీలు, అయిదు హాఫ్ సెంచరీలున్నాయి. ఇండియా మీద అతడి వ్యక్తిగత అత్యధిక స్కోర్ 180.

ఇండియా, ఇంగ్లండ్ మధ్య మ్యాచుల్లో జోరూట్ బ్యాటింగ్ యావరేజ్ 58.55గా ఉంది. అతడి కంటే ముందు రాహుల్ ద్రవిడ్ 60.93తో ఉన్నాడు. ఈ సిరీస్‌లో జోరూట్ ఒకటి, లేదా రెండు సెంచరీలు చేస్తే ద్రవిడ్‌ను అధిగమించే అవకాశమూ ఉంది. డబ్ల్యూటీసీ సైకిల్ 202325లో జోరూట్ 22 టెస్టులు, 40 ఇన్నింగ్స్‌ల్లో 54.66 యావరేజ్‌తో 1,968 పరుగులు చేశాడు. ఇందులో ఏడు శతకాలు, ఏడు అర్ధశతకాలున్నాయి. జూన్ 20 నుంచి జరగనున్న సిరీస్‌లో బ్యాటింగ్‌లో రాణిస్తే అతడు వ్యక్తిగతంగా తన గణాంకాలను మరింతగా మెరుగు పరుచుకునే అవకాశం ఉంది.

# వరల్డ్ కప్ తర్వాత ఆ ఏడుగురి కెరీర్ నాశనం.. బీసీసీఐపై యోగ్‌రాజ్ ఆగ్రహం

టీమిండియా లెజెండరీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి, మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ మరోసారి బీసీసీఐపై మండిపడ్డాడు. 2011 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత ఏడుగురు టీమిండియా క్రికెటర్ల కెరీర్లను సెలెక్టర్లు నాశనం చేశారని యోగ్‌రాజ్ ఆగ్రహం వ్యక్తంచేశాడు. అప్పటి చీఫ్ సెలెక్టర్ మొహిందర్ అమర్‌నాథ్ తదితరులను తిట్టిపోశాడు. 'బీసీసీఐ సెలెక్టర్లు ఎలాంటి కారణం లేకుండా ఈ కుర్రాళ్ల కెరీర్ నాశనం చేశారు. గౌతమ్ గంభీర్, యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్, మహమ్మద్ కైఫ్, వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రావిడ్.. 2011 తర్వాత ఈ ఏడుగురి కెరీర్ ముగిసింది' అని యోగ్‌రాజ్ గుర్తుచేశాడు.2011 తర్వాత ఈ జట్టును సెలెక్టర్లు నాశనం చేశారని, ఇలాంటి కారణాల వల్లే జట్టు ఇబ్బందుల్లో పడిందని అన్నాడు. అప్పటి వరల్డ్ కప్ విజయం తర్వాత ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీసుల్లో భారత్ వైట్ వాష్ చవిచూసింది. దీంతో కెప్టెన్‌గా ధోనీని కూడా తప్పించాలని అమర్‌నాథ్ అనుకున్నాడని, అయితే అప్పటి బీసీసీఐ చైర్మన్ ఎన్ శ్రీనివాసన్ దీన్ని అడ్డుకున్నాడని యోగ్‌రాజ్ చెప్పాడు. ఒక ప్లేయర్ను నమ్మితే అతనికి మద్దతుగా నిలబడాలని, అంతేకానీ ఇలా చేయకూడదని అన్నాడు. కాగా, టెస్టు సిరీసుల ఓటమి తర్వాత లక్ష్మణ్, ద్రావిడ్ రిటైర్ అయిపోయారు. జహీర్, హర్భజన్, యువరాజ్, గంభీర్ నెమ్మదిగా జట్టుకు దూరమయ్యారు.

